
# అనిర్వచనీయం



—అవధానుల విజయలక్ష్మి

"నీ గులాబీ పువ్వులు చాలా అందంగా ఉన్నాయోయ్!"

పదినిమిషాల్నించి ఏదో ఆలోచిస్తూ మౌనంగా కూర్చొన్న నేనుఉలిక్కిపడి తలెత్తి చూశాను.

హోరు మంటోంది సముద్రం... చీకటి పడిపోయిందేమో చాలామంది వెళ్ళిపోయారు.....బీచిలో పల్చగా అక్కడక్కడున్నారు జనం.

"గులాబీ పువ్వులా? ఎక్కడా?" శ్రీవారి వైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాను.

"నీ ముందే...ఇసుకలో చూడు!"

చూశాను...పదినిమిషాల్నించి ఏదో ఆలోచిస్తూ నాకు తెలియకుండానే ఇసుకలో వేసిన పువ్వులు రెండు నా వైపు చూసి నవ్వుతున్నాయ్.

"అరే ఇవినాకు తెలియకుండా నే వేసేశానే ఆయినా బాగానేకుదిరాయి సుమండీ" అన్నానా పువ్వులవైపే ముచ్చటగా చూస్తూ. "ఆలా మనకు తెలియకుండానే ఏదో ఆలోచిస్తూ ఏదేదో రాసేస్తామే

దానినే డూడిల్స్ అంటారు" అన్నారు శ్రీవారు నా వంక గర్వంగా చూస్తూ, ప్రపంచపు ఎనిమిదో వింత కనిపెట్టినట్లు పోజు కొడుతూ. "ఆ మాత్రం ఇంగ్లీషు నాకూ తెలుసులేండి... నేను ఎమ్మే చేసింది ఇంగ్లీషులోనే!

"ఎమ్మే చేశాననకు...చదివానను... చేశానన్నది డిగ్రీ పుచ్చుకొన్నవాళ్ళకే వర్తిస్తుంది."

"ఏదో ఒకటి!" మూతి ముడుచుకొన్నాను.

"అదిగో బీచిలో కూర్చొని మూతినలా సున్నాలా చుట్టకు, చాలా ప్రమాదం!"

"గొప్పే!" నవ్వేశాను.

"ఈ డూడిల్స్ గురించి ఎన్నో శాస్త్రాలున్నాయి తెలుసా? హేండ్ రైటింగ్‌ని బట్టి ఒక మనిషి మనస్తత్వం ఎలా అంచనా వెయ్యొచ్చో ఒక మనిషి వేసే డూడిల్స్‌ని బట్టికూడా అలాగే అంచనా వెయ్యొచ్చునట తెలుసా?"

"అబ్బో మీ కెన్ని విషయాలు తెలుసో!" ఆశ్చర్యం నటించాను.

"అదిగో అలా వెటకారాలు చేస్తేనే నాకు కోపం వస్తుంది! నే నేదో సీరియస్‌గా చెప్తుంటే—" శ్రీవారు అర్జంటుగా కోపం తెచ్చేసుకోబోయి చేతకాక మానేశారు.

"సరే చెప్పండి—ఈ సారి బుద్ధిగా వింటాలెండి" బుద్ధిగా కూర్చొని అంతకంటే బుద్ధిగా మొహం పెట్టి వినడానికి సిద్ధంగా కూర్చొన్నాను.

"అదీ—మంచి అమ్మాయిలంటే అలా ఉండాలి...ఆఁ—ఎంతవరకు చెప్పాను? డూడిల్స్‌ని బట్టి మనిషి మనస్తత్వాన్ని అంచనా వెయ్యొచ్చునని కదూ! ఉదాహరణకి నీలా అందమైన పూలూ రెమ్మలో, లేక పక్షులూ, సీతాకోక చిలుకలో వేసేవాళ్ళయితే వాళ్ళకి ఈస్తటిక్ సెన్సు ఎక్కువగా ఉందన్నమాట!—అంతేకాదు వీళ్ళు ముందుగా వేసుకొన్న ప్లాను ప్రకారం కాక ఇన్‌ట్యూషన్ ప్రకారం చేస్తారన్నమాట!"

"నా లాగ" అన్నాను మధ్యలో అందుకొంటూ.

"ఉష్ ముందు నన్ను చెప్పనీ— కొందరు ఉత్తగీతలు గీయడమో లేక త్రిభుజాలు చతురస్రాలు లాటి జామెట్రికల్ ఫిగర్స్ వేయటమో చేస్తుంటారు. అలాంటి వాళ్ళు పూర్తి ప్రాక్టికల్ మనుష్యులన్నమాట! జీవితంలో వేసే ప్రతి అడుగునీ తూచి తూచి వేస్తారు. అనవసరంగా ఆవేశపడిపోరు— ఆనందాలకీ దుఃఖాలకీ అతీతులుగా ఉంటారు."

"అంటే మీలాగ"

"మధ్యలో నా మీద పడతావేం?" అన్నారు ఉడుక్కొంటున్నట్లు నటిస్తూ.

"మీ ముందున్న ఇసుకలో చూడండి సార్ మీకే తెలుస్తుంది. ఆయన

ముందున్న ఇసుకలో త్రిభుజాలు, చతురస్రాలు ఉన్నాయి.

"అరే ఇవి వేసినట్లు నాకే తెలియదే" ఆశ్చర్యంగా అన్నారు.

"అందుకే వాటిని డూడిల్స్ అన్నారు!" ఈసారి గర్వపడం నా వంతయింది.

"గొప్పే." అన్నారు నెత్తిమీద మొట్టికాయ వేస్తూ.

"స్లో అదన్నమాట మీ మనస్తత్వం. ఆనందాలకీ దుఃఖాలకీ అతీతులుగా ఉండటం!— పెళ్ళాం ముచ్చటపడి మూడొందలు పెట్టికొన్న పట్టుచీర కట్టుకొన్నప్పుడు సంతోషించక యోగిలా ఉండిపోయినప్పుడే అనుకున్నా లెండి మీరలాంటి వాళ్ళని!"

"ఘోరమేమీ ఏడవలేదు... సంతోషించు"

"అవ్వ...ఎర్రంచు తెల్ల పట్టుచీర! కట్టుకొంటే లక్ష్మీదేవిలా... ఉన్నావని ఊరంతా అన్నారు."

"ఇక ఆ చీర ఊసు చాలించు... ఎంతదాకా వచ్చాం? ఆఁ—ఇక మూడో రకం వాళ్ళుంటారు. వాళ్ళు ఏవేవో పదాలు ఇంగ్లీష్‌లోనో తెలుగులోనో రాసేస్తూ ఉంటారు. ఉదాహరణకి 'థాంక్యూ' 'హలో' లాంటివి. లేకపోతే వాళ్ళకిష్టమైన వాళ్ళ పేర్లో—ఇలాటి వాళ్ళు అతి వాగుడుకాయలైనా అవుతారు. ఎప్పుడూ మౌనంగా కూర్చొని ఏదో ఆలోచించే వాళ్ళైనా అవుతారు. వాగుడుకాయలైతే తన మాటలు వినడానికి పక్కన ఎవరూ లేనప్పుడో, లేక తప్పనిసరిగా ఇంకొకరి మాటలు వినవలసి వచ్చినప్పుడో అలా చేస్తుంటారు—అదిగో మళ్ళా వెటకారంగా నవ్వుతున్నావ్."

"ఛఛ. వెటకారం కాదుసార్! మీరు చెప్పింది ఎంత బుద్ధిగా వింటున్నానో తెలుసా? మీరు ఏవేవో పదాల్ని తెలియకుండానే రాయడం గురించి చెప్తుంటే ఓ విషయం గుర్తొచ్చి నవ్వొచ్చింది."

"నిజంగానే?" నా వైపు అనుమానంగా చూస్తూ అడిగారు.

"నిజం! చెప్తే చిన్న కథంతవుతుంది. పదండి నడుస్తూ చెప్పుకొందాం" ఇద్దరం లేచి ఒంటికంటిన ఇసుకను దులుపుకొని నడక సాగించాం.

"ఊ మొదలెట్టు నీ కథ— చెప్తానన్నప్పుడు వినక తప్పుతుందా!" అన్నారు శ్రీవారు జేబులో చేయిపెట్టుకొని నడుస్తూ.

"అవి నేను ఎమ్మే చదువుతున్న రోజులు—" మొదలెట్టాను.

"ఎమ్మేకి నేను ప్రైవేటుగా కట్టానని తెలుసుగా?"

"కాని పాపం పాసవలేదు!" సానుభూతి ఒలకబోశారు.

"అదిగో అలా డిస్టర్బ్ చేస్తే నేను చెప్పను పోండి. మీరు చెప్తుంటే నేనెంత బుద్ధిగా విన్నాను!"




"ఓకే—ఓకే— చెప్పు"

"ఇంట్లో కూర్చొని చదవడం లేదని నాన్న నన్ను ట్యుటోరియల్ కాలేజీలో చేర్పించారు. సాయంత్రం ఆరునించి ఎనిమిదిన్నర దాకా ఉండేవి క్లాసులు. క్లాసులో ఇరవై మందిమి ఉండేవాళ్ళం. అందులో నేనూ, నళినీ తప్ప అందరూ మగాళ్ళే. పగలల్లా ఉద్యోగం చేస్తూనో, టైపూ, షార్టుహాండూ నేర్చుకొంటూనో సాయంత్రం క్లాసుకి హాజరయ్యేవారు. కాలేజిలోలా అల్లర్లూ, ఏడిపించుకోడాలూ లేవు—పైగా సగంమంది ఆఫీస్‌నించి డైరెక్టుగా కాలేజీకి వచ్చేవారేమో మొహాలు జిడ్డోడుతూ ఉండేవి!" 'అయిలీక్లాస్' అని పేరు పెట్టింది నళిని అందుకే. తనూ ఓ బాంకులో పని చేసేది. బాంకునుంచి ఇంటికెళ్ళి ఎప్పుడు రిఫ్రెష్ అయి వచ్చేదో కాని క్లాసుకి పువ్వులా వచ్చేది. క్లాసు జరగనంత సేపూ ఒక్క క్షణం నోరు ముయ్యకుండా వాగేది. క్లాసు జరుగుతున్నప్పుడు మాత్రం ఆసక్తిగా ఉంటే శ్రద్ధగా వినేది. కాస్త బోరు క్లాసయితే మాత్రం చేతిలో పెన్నుతో ఎదురుగా ఉన్న నోట్‌బుక్ మీద ఏదేదో రాసేది"

శ్రీవారికి కథలో ఇంట్రెస్టు పుట్టినట్టుంది ఎలర్ట్ అయి నాక్కాస్త దగ్గరికి జరిగారు.

"ఏం రాసేది?" కాస్త కుతూహలంగా అడిగారు.

"మీరు ఇందాక చేశారు చూశారా ఎనాలిసిస్? అది కరక్టే! నోరు ముయ్యకుండా వాగే నళిని తప్పనిసరిగా నోరు ముయ్యవలసి వచ్చినప్పుడు ఎదురుగా ఉన్న కాగితం మీదనో నోట్‌బుక్ మీదనో 'థాంక్యూ' అనో 'హలో' అనో రాసేది.

"చెప్పు, చెప్పు" శ్రీవారు ఉత్సాహం ఇనుమడించింది.

"ఇక అసలు కథ మొదలవుతుంది. మధ్యలో మాట్లాడకుండా జాగ్రత్తగా వినండి" అన్నాను లెక్చరర్ ఫోజు

కొడుతూ.

"ఎస్ మేడమ్!"

ఆ రోజు ఆఖరి పీరియడ్ స్టాటిస్టిక్. ఏమ్మే ఎకనామిక్స్‌కి ఈ స్టాటిస్టిక్సెందుకే దండగ! అంటుండేది నళిని. తనకి స్టాటిస్టిక్సంటే తలనొప్పి! చెప్పే ట్యూటరూ అలాటాయనే! ఆయన రిటైర్డు బాంకు ఉద్యోగి. ఆయన గొంతు ముందు రెండుమూడు బెంచీలకే వినబడేది. ఆ రోజు కూడా ఆయన పాఠం చెప్తుంటే నళిని నోట్ బుక్ మీద ఏవేవో రాస్తూ కూర్చొంది. కాసేపటికి పెన్నులో ఇంకైపోయినట్టుంది నా పెన్నడిగింది.

"పిచ్చి గీతలు గియ్యడానికి పెన్నెందుకూ?—అయినా నేను పాయింట్సు నోట్ చేసుకుంటున్నాను." అన్నాను

నా వైపోసారి చిరుకోపంతో చూసి జుత్తుకి పెట్టుకొన్న చెంపపిన్ను తీసి ఏవేవో రాయసాగింది టేబిల్ మీద.

క్లాసయిపోయింది. అందరూ హడావిడిగా బయటకు నడుస్తున్నారు. నేనూ నళినీకూడా నిలబడ్డాం. ఎదురుగా డెస్కుమీద చెంప పిన్నుతో హలో... హలో...హలో అని రాసుంది. కొత్తగా పెయింట్ చేశారా డెస్కులకి! ఆ పెయింట్ పూర్తిగా ఆరకుండానే తన రాతల్తో ఖరాబు చేసినందుకు — చెప్పొద్దూ... తన మీద కాస్త కోపం కూడా వచ్చింది.

ఆ మాటే తనతో అంటే

"పోనిద్దూ — రెండు రోజుల్లో ఎలాగూ ఖరాబయ్యేవే!" అంది నిర్లక్ష్యంగా నవ్వుతూ.

మర్నాడు మొదటి పీరియడే స్టాటిస్టిక్సు క్లాసు. అతి మెల్లగా వినబడుతున్న ముసలాయన గొంతుని జాగ్రత్తగా వినడానికి ప్రయత్నిస్తూ, నోట్ బుక్‌లో ఒక్కో పాయింట్ నోట్ చేసుకొంటున్నాను. నెమ్మదిగా నా చేతిమీద తట్టి పిలిచింది నళిని.

ఏమిటన్నట్లు కాస్త విసుగ్గా చూశాను. నళిని మొహంలో ఏదో సంభ్రమం కనపడుతోంది.

"ఈ డెస్కుమీద చూడు" తన ముందున్న డెస్కు చూపించింది. నిన్న చెంప పిన్నుతో తను హలో—హలో అని రాసిన దాని కిందనే "హలో డియర్ హౌ ఆర్యూ అని రాసుంది.

నాకూ కాస్త కుతూహలం వచ్చింది? ఈ నళిని తోచక డెస్కుమీద ఏవేవో రాసేస్తే అది చదివి ఎవరో కొంటె వాళ్ళు నిజంగానే దానికి జవాబు రాశారు.

క్లాసంతా అసహనంగానే గడిపింది నళిని. క్లాసులోంచి మాస్టరు బైటికడుగు పెట్టగానే అందుగురించే ఎదురు చూస్తున్న దాన్లా నా దగ్గరికి జరిగి గుసగుసగా అంది.

"ఈ అమ్మాయెవ్వర్తో పది హేనేళ్ళదో పదహారేళ్ళదో అయ్యుంటుంది, ఆ

హాలోహాలోలు చదివి 'అవ్వ! చూడే వీడెవడో అల్లరి వెధవ ఎలా రాశాడో! ఉండు వీడికి బుద్ధి చెప్తాను' అని బుగ్గలు నొక్కేసుకొంటూ తన స్నేహితురాల్తో చెప్పి తనూ రాసేసి ఉంటుంది."

"అలా ఎందుకనుకొంటావ్? ఆ రాసినది ఏ పదహారేళ్ళ అబ్బాయో అవ్వొచ్చు కదా? "ఒరేయ్ ఎవర్తో పిల్ల చూ(డ్రోయ్ ఎలా రాసిందో! చూడు! నేను ఏదో రాసి ఆ పిల్లని ఎలా ఏడిపిస్తానో"! అని గర్వంగా తన స్నేహితుడితో చెప్పి రాయొచ్చు కదా?"

"పాయింటే సుమా! ఆ రాసింది అబ్బాయంటావా? అమ్మాయా? రైటింగ్ చూస్తే నీకేమైనా తెలుస్తోందా? ఆ రాత వైపే పరీక్షగా చూస్తూ అడిగింది. ఆ అక్షరాలు కూడా ఏ పెన్సుతోనో, గుండు సూదితోనే రాసినవే! గట్టిగా నొక్కిపట్టి రాయడంవల్ల వంకరటింకరగా వచ్చాయి అది ఆడపిల్లలరాతో, మగపిల్లలరాతో తెలుసుకోవడం కష్టమే!

"మనం ఏ పదిహేనేళ్ళ పిల్లలో రాసిన రాతలే అనుకొంటున్నాం కానీ ఇంకా చిన్న పిల్లలు అంటే ఏ పదేళ్ళ వాళ్ళో రాసి ఉండొచ్చుగా?"

"అవును అదీ నిజమే!" అంది నళిని ఆలోచిస్తూ.

అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. మా ట్యుటోరియలే క్లాసెస్ ఓ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు బిల్డింగులో జరిగేవి! ఆ స్కూల్లో కేజీ క్లాసునించి ట్వెల్తు క్లాసుదాకా తరగతులుండేవి. పగలల్లా స్కూలు జరిగాక సాయంత్రం పూట రకరకాల క్లాసులు—మ్యూజిక్ క్లాసులు... డాన్సుక్లాసులు—మా ట్యుటోరియల్ క్లాసులు—సియే ఎంట్రెన్స్ కోచింగ్ క్లాసులు—మెడికల్ ఎంట్రెన్స్ కోచింగ్ క్లాసులు—ఇలా ఎన్నెన్నో! రాత్రి తొమ్మిద్దాకా జరుగుతూనే ఉండేవి. ఇప్పుడు మేము కూర్చొంటున్న క్లాస్ రూంలో పగలు ఏ క్లాసువాళ్ళు కూర్చొంటారో తెలియదు! కేజీనించి పన్నెండు దాక ఏ తరగతి వాళ్ళైనా కూర్చొనే అవకాశముంది.

అక్కడ ఏ క్లాసువాళ్ళు కూర్చొంటారో తెలిస్తే కాని, వాళ్ళ వయస్సుని అంచనా కట్టడం కష్టం!

ఇవి నిశ్చయంగా ఏమీ తోచక వ్రాసిన డూడిల్స్ కాదు!

ఏ అయిదోక్లాసువాళ్ళో ఆరోక్లాసు వాళ్ళో అయితే 'అరే ఇక్కడేవో అక్షరాలు రాసి ఉన్నాయే మనమూ రాసి చూద్దాం ఏమవుతుందో అనే పసితనపు కుతూహలంతో రాసిన రాతలు. అవే ఏ పదోక్లాసువాళ్ళో, పదకొండో క్లాసు వాళ్ళో అయితే ఆ రాసినది ఆపోజిట్ సెక్స్‌వాళ్ళే నన్న ఊహతో సహజమైన ఎడాల్సెంట్ చిలిపితనంతో రాసిన రాతలు.

నేను ఆలోచనలో ఉండగానే నళిని

చెంపపిన్ను తీసి డెస్కు మీద మళ్ళీ ఏదో రాస్తోంది.

"అరే ఏం రాస్తున్నావ్ మళ్ళా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ అమ్మాయో, అబ్బాయో రాసిన దానికి జవాబు—చూద్దాం మళ్ళా రేపు దీనికి ఏం జవాబు వస్తుందో!"

నేను డెస్కు వైపు చూశాను.

"హలో డియర్ హౌ ఆర్యూ?" కింద "ఫైన్ వాటెబౌట్ యూ" (బాగున్నాను మరి నీ సంగతో?) అని రాసింది.

"ఇరవై రెండేళ్ళొస్తున్నాయ్! నీకే బుద్ధిలేకపోతే చిన్నపిల్లలు వాళ్ళకెలా బుద్ధొస్తుంది?" అన్నాను కోపం నటిస్తూ.

"పోవోయ్! ఎన్నేళ్ళొచ్చినా మనం చిన్నపిల్లలమే" అంది చిలిపిగా నవ్వుతూ.

ఆ తర్వాత ఇద్దరు చాలా సేపు ఆలోచించాం పగటిపూట అక్కడ ఏ క్లాసు వాళ్ళు కూర్చోడానికి అవకాశముందోనని!

"బాంతుకి ఓ పూట సెలవు పారేసి వచ్చి చూస్తే సరిపోదూ?" అంది నళిని.

"సిగ్గులేదూ? బెంచిమీద ఆ రాతలు ఎవరివో చూడ్డానికి పనిమాలా సెలవు పెట్టుకునొస్తావా?" కసిరాను.

ట్యూటర్ రావడంతో తప్పనిసరిగా నోరుమూసుకొంది నళిని.

తనని కసిరానే కాని ఇంటికెళ్ళాక కూడా నాకు ఆలోచనలు ఆగలేదు ఆ రాసినది అబ్బాయా? అమ్మాయా? ఏ వయస్సు? అని.

రాత్రి పక్కమీద వాలిన తర్వాత హటాత్తుగా తట్టింది! పగటిపూట ఆ రూములో ఏ క్లాసువాళ్ళు కూర్చోంటారో తెలిపే బోర్డులు ఆ రూముల బయటే ఉంటాయి! నిన్న అంత సేపు ఆలోచించినా ఇద్దరికీ ఆ విషయం తట్టనే లేదు!

మర్నాడు సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తూ గడిపి, అయిదున్నరకే నళిని ఇంటిముందు లూనా ఆపాను రోజూ వెళ్ళేటప్పుడు నళినిని లూనా మీద ఎక్కించుకొని వెళ్ళడం మళ్ళా ఇంటికొస్తున్నప్పుడు దార్లో తనని డ్రాప్ చేయేడం నా అలవాటు.

"క్లూ దొరికిందోయ్" అన్నాను లూనా స్టార్టవగానే.

"క్లూనా? ఏం క్లూ?"

క్లాసురూం బయట బోర్డుల గురించి చెప్పాను.

"అరే! ఇంత చిన్న విషయం మనకి తట్టనే లేదే!" సంభ్రమంగా అంది.

నాకూ ఆతృతగానే ఉంది. అందుకే లూనాని కాస్త వేగంగా నడిపించాను. ఇద్దరం క్లాసువైపు పరిగెత్తినట్టే నడిచాం.

క్లాసురూం బయట బోర్డుపెట్టే ఫ్రేం ఖాళీగా వెక్కిరించింది! ఆ ఫ్రేమేకాదు

వరసగా ఉన్న క్లాసులన్నిటి బయటా ఉన్న ఫ్రేములు ఖాళీగానే ఉన్నాయి.

"డామిట్! ఒక్క క్లాసుకీ బయట బోర్డులేదు! ఏం స్కూలో — దర్టీ స్కూల్!" అంది నళిని చిరాగ్గా.

"ఆ బోర్డులన్నీ నేనే పీకేసినట్లు నా మీద చిరాకుపడతావేం? పదపద మాస్టా రొస్తున్నారు" ఇద్దరం లోపలికి నడిచాం.

అంతకు రెండు మూడు రోజుల ముందుదాకా ఉన్న బోర్డులన్నీ హటాత్తుగా ఎలా మాయమైపోయాయో అర్థం కాలేదు. మొన్నటిదాక ఆ బోర్డు మీద వేసి ఉన్న అంకె గుర్తుంచుకోవలసిన అవసరం రాలేదు. తీరా ఇప్పుడా అవసరం వచ్చేసరికి బోర్డే మాయమయింది!

క్లాసు మొదలయింది. నళిని నా మోచేతిమీద గిల్లింది. ఈసారి నాకు తానెందుకు గిల్లిందో వెంటనే తెలిసిపోయింది. డెస్కువైపు చూశాను. నిన్న నళిని రాసిన దాని కిందనే "ఐటూ యామ్ ఫైన్! థ్యాంక్యూ!" (నేను కూడా బాగున్నాను. కృతజ్ఞతలు) అని రాసుంది.

నళిని వస్తున్న నవ్వుని పెదవుల మధ్య బిగపట్టుకొంటూ మళ్ళా చెంప పిన్నుతో దానికింద రాసింది.

"మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్!" (మీ శుభనామం తెలుసుకోవచ్చా)

"ఈ దెబ్బతో వయసు తెలియక పోయినా పేరైనా తెలుస్తుంది" ఉత్సాహంగా అంది నళిని.

నళిని ఉత్సాహం నాకూ అంటింది. నాలోనూ ఎక్సయిట్‌మెంట్ పెరిగింది.

మర్నాడు క్లాసులో అడుగుపెట్టగానే ఆత్రంగా డెస్కువైపు చూశాను. "ఫస్ట్ లెట్ మీ నో యువర్ నేమ్ ప్లీజ్!" అని ఉంది.

"ఎవరో గడుసు పిండం!" అంది నళిని విరాళగా.

"ఏ పదిహేను, పదహారేళ్ళ ఆడపిల్లో అయుంటుంది. లేకపోతే పేరు చెప్పడానికి అంత సందేహించదు".

"నువ్వు చెప్పింది నిజమేననుకో... కాని అవతలి అమ్మాయి పేరు చెప్పాక మనం చెప్పొచ్చులే అనుకొనే కొంటె కుర్రాడవొచ్చుగా?"

"అవొచ్చు"

"ఇవాళేం రాయమంటావ్?"

"ఇంకా వెధవ రాతలు మానేద్దూ! పాపం కొత్తగా వార్నిష్ చేయించిన ఫర్నీచరు—ఇప్పటికే సగం తగలడింది" అన్నాను.

"ఇదే ఆఖరు అస్త్రం—పేరు తెలియక పోయినా వయస్సు తెలుస్తుంది" అంది తలలోంచి పిన్ను తీస్తూ—

"లెటజ్ ఫర్గెట్ అబౌట్ యువర్ నేమ్స్! బట్ ఐ లవ్యూ ఫర్ యువర్ రైటింగ్స్" (పేర్ల గురించి ఇక మర్చిపోదాం. కాని నీ రాతలు చూసి నిన్ను

(ప్రేమిస్తున్నాను)

"ఏమిటా రాతలు? నువ్వే ఇలా రాస్తున్నావని ఎవరికైనా తెలిస్తే—" అన్నాను కంగారుగా.

"ఎవరికి తెలుస్తుంది లెద్దూ" నిర్లక్ష్యంగా అంది.

"అలా అనకు. మనం ప్రయత్నించి నట్లే అవతలివాళ్ళూ ప్రయత్నించచ్చుగా?"

"పోనిద్దూ అప్పాయిర్ కుర్ర వెధవలు—ఏం చేస్తారు!" అంది తేలిగ్గా. "నాకేం నచ్చలేదీ భాగోతం—సోమవారం నించి మొదలయింది. ఇవాళప్పుడే శనివారం."

"అందుకే ఇది ఆఖరిసారన్నాను. సోమవారంనాడు దీనికి జవాబేమొస్తుందో చూడాలి. చిన్న పిల్లలయితే ఏం రాయాలో తెలియక ఉరుకొంటారు. కాస్త పెద్ద పిల్లలయితే ఏదోటి రాస్తారు. ఆడపిల్లలయితే బహుశః తిడుతూ ఏదో రాస్తుంది. మగపిల్లాడైతే చిలిపిగా ఏదో రాస్తాడు" అంది నళిని తను రాసిన వాక్యంవైపు చిలిపిగా చూస్తూ.

"నీ కర్మ" అన్నాను నుదురుకొట్టుకొంటూ.

క్లాసులయిపోయాక గేటుదాటి బయటికెళ్తుండగా "ఒక్క క్షణం ఆగు" అంది నళిని నా చేయి పట్టుకొని ఆపుతూ.

లూనా స్టార్ట్ చేయబోతున్న నేను ఆగిపోయాను.

గేట్ ప్రక్కన స్టూలుమీద కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు వాచ్‌మాన్.

"నువ్వు ఈ సరస్వతీ హైస్కూల్ వాచ్‌మాన్‌వే కదూ?"

"అవునండీ" అన్నాడు నిద్ర కళ్ళతో...ఎందుకడుగుతున్నామో అర్థం కానట్లు మొహంపెట్టి.


"క్లాసురూంల బయట బోర్డులుంటాయి కదా! అవేమయ్యాయి?"

"ఓహో అవండీ? మొన్ననే పాత బడిపోయాయని అవన్నీ పీకించేశారండీ. మళ్ళా కొత్తగా పేయింటేయించుతారంట! ఈ మధ్యనే కుర్చీలకీ బెంచిలకీ పెయింటేయించారు కదా? స్కూలంతా మళ్ళా కొత్తదాన్లా చేస్తారంట."

"ఓహో అలాగా? అవునూ... చూడు మొదటంతస్తులో అట్నుంచి మూడో రూముంది చూడు అక్కడేక్లాసు పిల్లలు కూర్చొంటారు?"

"అక్కడాండీ......మరే ఈ మద్దినే కొన్ని కొత్త రూములు కట్టారు కదండీ. క్లాసులన్నీ ఇట్నుంచి అటు చేసేశారండీ...నేను కూడా వారం రోజులు సెలవుపెట్టి ఈ రోజే డూటీలో చేరానండీ! నాకు సరిగ్గా తెలియదండీ! నేను సెలవులో ఎళ్ళక ముందుమాత్రం అక్కడ కేజీ క్లాసువాళ్ళు కూర్చొనేటోరండీ" వినయంగా బుర్ర గోక్కుంటూ చెప్పాడు.

హతాశులయ్యాం ఇద్దరం.




సోమవారం వచ్చేసింది.

పది నిమిషాల ముందరే ఇద్దరం క్లాసులోకి నడిచి డెస్కు వైపు ఆత్రుతగా చూశాం.

"ఐ టూ లవ్యూ డియర్! ఎండ్ వాంట్ టు మేరీ యూ (నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళికూడా చేసుకోవాలనుంది).

"అమ్మో...అమ్మో..." గుండెల మీద చెయ్యి వేసుకుంది నళిని. నాకు మాత్రం సస్పెన్సు తీరిపోయిన రిలీఫ్ కలిగింది.

ఇప్పుడు ఖచ్చితంగా తెలిసిపోయింది ఇది ఖచ్చితంగా ఏ పదిహేనో, పదహారో ఏళ్ళ కుర్రాడి పనే!" అన్నాను.

"అంతేకాదు...వాడు చదువు సంధ్యల మీద ధ్యాసలేక మాస్టారు పాఠం చెప్తుంటే దిక్కులు చూసే ఆకతాయి వెధవ" అంది నళిని కసిగా.

"అయితే ఇవాళేం రాస్తావు?" కుతూహలంగా అడిగాను.

"మొన్నటితో రాతలు బందయి పోయాయిగా? మళ్ళా ఏమైనా రాస్తే నువ్వు తిట్టవూ? ఇవ్వాళ్టితో నా తరపు నించి ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నా...మరీ ఆకతాయి వెధవైతే మళ్ళా రాస్తాడు. రాసుకోనీ" అంది నళిని నవ్వుతూ.

చెప్పొద్దూ—ఇంతటితో ఈ ప్రహసనం ఆగిపోతున్నందుకు నాక్కాస్త నిరుత్సాహంగానే అనిపించింది. మొన్న నళినిని మందలించింది నేనే అయినా.

క్లాసులయిపోయాయి. ఇద్దరం బయట పడ్డాం.

లూనా సగం దూరం వెళ్ళాక నళిని కంగారుగా అరిచింది.

"అరెరె ఒక్కసారాపు"

నేను బ్రేక్ వేశాను.

"ఏమయింది?"

"క్లాసులో చేజ్ నవల మరిచిపోయాను. రేపొద్దున్న రిటర్న్ చేయకపోతే ఆ సావిత్రి నా పీక పట్టుకొంటుంది. తనూ ఎవరి దగ్గరున్నుండో తెచ్చిందట. బాబ్బాబూ ఒక్కసారి వెనక్కు తీసుకెళ్ళావూ" అనా వెనక్కు తిప్పాను.

గేటుముందు గూర్ఖా ఇంకా కూర్చునే ఉన్నాడు.

"క్లాసురూములకి తాళాలేసేశావా?" నళిని అడిగింది.

వేసేశానండీ"

అయితే తాళాలొకసారిస్తావా? రూంలో పుస్తకం మరిచిపోయాం. తెచ్చుకోవాలి.

"ఏ రూమండీ?"

"అదే—మొన్న చూపించాం చూడు మొదటి అంతస్తులో అట్నుండి మూడో రూము"

"అదాండీ—దానికింగా వెయ్యలేదండీ—ఆ ముసలి మాంస్టారింకా అక్కడ కూర్చొనున్నారండీ"

"అదేమిటాయనింకా ఇంటికెళ్ళలేదూ?"

"లేదండీ—ఆయన రోజు క్లాసయిన వెంటనే ఎల్లిపోరు కదండీ! రోజు అర గంటో, ముప్పావుగంటో ఏవేవో పుస్తకాలు చదూకొని ఆ తర్వాత ఏదేదో రాసుకొని ఆ తర్వాత ఆయనే తాళం వేసేసి తాళం చెవి నా కిచ్చేసి వెళ్ళిపోతారండీ."

"ఇప్పుడీ ఓల్డ్ జంటిల్మాన్ని ఎదుర్కొవాలి! ఎలా చదువుతున్నారు? ఏంటని ప్రశ్నలేస్తాడేమో!" అంది నళిని విసుగ్గా మెట్లెక్కుతూ.

"జవాబు చేప్తై పోలా" అన్నాను.

క్లాసు దగ్గరికి నడిచేసరికి కిటికీలోంచి మాస్టారు కనిపించారు. నళిని సీటు దగ్గర కూర్చొనున్నారు. ఆయన ముందు బండెడు పుస్తకాలు—చిందరవందరగా!

"ఈయన అక్కడ కూర్చొని ఏం చేస్తున్నాడు!" అంది నళిని నా చెవిలో గుసగుసగా.

"కాస్త విశాలంగా ఉంటుందని అక్కడ కూర్చున్నారేమో" అన్నాను నేనూ గుసగుసగానే.

క్లాసు గుమ్మంలోకొచ్చాం. మాస్టారు డెస్కుమీదికి ఒంగి కళ్ళజోడు సవరించుకొంటూ ఏదో చాలా దీక్షగా రాస్తున్నారు.

"ఎక్స్ క్యూజ్ మి సర్" అన్నాం అయిద్దరం ఒక్కసారే!

ఆయన ఉలిక్కిపడి తలెత్తి చూశారు.

మేమూ ఆయన కూడా నిర్ఘాంతపోయి ఒకరినొకరు చూస్కొంటూ ఉండిపోయాం కాస్సేపు. ఆయన నిర్ఘాంతపోడాని క్కారణం మమ్మల్ని హఠాత్తుగా అక్కడా చూడ్డం కావచ్చు:

మేము నిర్ఘాంతపోడాని క్కారణం మాత్రం దీక్షగా బెంచిమీద రాస్తున్న ఆయన చేతిలోని గుండుసూదిని చూపి.

ఆయన చేతిలోంచి జారిపడిన గుండుసూది చప్పుడు ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా వినిపించింది    * *